## నేటి నుంచి

**1 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు అందించనున్న ప్రభుత్వం**

**మధ్యాహ్న భోజన ఏజెన్సీల ద్వారా అల్పాహారం.. హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు**

# 'ముఖ్యమంత్రి అల్పాహారం'

### రావిర్యాలలో ప్రారంభించనున్న మంత్రులు హరీశ్‌రావు, సబితారెడ్డి

రంగారెడ్డి, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న చారిత్రక నిర్ణయంలో భాగంగా అమలు చేయనున్న 'ముఖ్యమంత్రి అల్పాహారం' కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని 'రావిర్యాల' ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి శ్రీకారం చుడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 6న ఈ పథకాన్ని అమలులోకి తెస్తుండగా.. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలన్నీ ఒకే ప్రాంగణంలో ఉన్న రావిర్యాల ప్రభుత్వ పాఠశాలలో మంత్రులు హరీశ్‌రావు, సబితారెడ్డి ఉదయం 8.30 గంటలకు లాంఛనంగా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఇప్పటికే ఉదయం వేళల్లో రాగి జావను అందిస్తుండగా.. మధ్యాహ్న భోజనాన్ని గుడ్డుతో పాటు అందిస్తున్నారు. ఇకపై అల్పాహారంగా కిచిడీ, పొంగల్, ఉప్మా వంటి వాటిని విద్యార్థులకు అందించనున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని అన్ని స్థాయిల విద్యార్థులకు ఈ అల్పాహారాన్ని ఇవ్వనున్నారు. దీంతో విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.



### జిల్లాలో 91,494 మంది విద్యార్థులకు ప్రయోజనం

**నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ఒక్కో పాఠశాలలో ప్రారంభించనున్న ఎమ్మెల్యేలు**

బొంరాస్‌పేట : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఆకలి తీర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం మరో కొత్త పథకానికి శ్రీకారం చుట్టనున్నది. 'ముఖ్యమంత్రి అల్పాహారం' పథకం పేరుతో విద్యార్థులకు అల్పాహారం అందించే నూతన పథకాన్ని అమలు చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఒక్కో పాఠశాలను ఎంపిక చేసి ఈ పథకాన్ని ప్రారంభించడానికి జిల్లా విద్యాశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. విద్యార్థులకు చదువుపై ఏకాగ్రత పెంచడం, కూలీ పనులు చేసుకునే పేద తల్లిదండ్రులకు ఇబ్బంది కలుగకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయనున్నది. ప్రభుత్వ నిర్ణయంతో వికారాబాద్ జిల్లాలో 91,494 మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగనున్నది.

### మన ఊరు-మన బడి కార్యక్రమం ద్వారా అభివృద్ధి చేసిన పాఠశాలల్లో..

సర్కారు విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్న ఉద్దేశంతో ఇప్పటికే సన్న బియ్యంతో రుచికరమైన మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తుండగా, రక్త హీనతను నివారించడానికి రాగి జావను కూడా ప్రభుత్వం అందజేస్తున్నది. ఉదయం పాఠశాలలకు వచ్చే విద్యార్థులు ఇంటి వద్ద అల్పాహారం తినకుండానే ఖాళీ కడుపుతో వస్తున్నారని, దీనివల్ల విద్యార్థుల శారీరకంగా, మానసికంగా అలసట చెంది పాఠాలపై దృష్టి సారించరన్న ఉద్దేశంతో ప్రభుత్వం 1 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించాలని నిర్ణయించింది. దసరా పండుగ రోజు 'ముఖ్యమంత్రి అల్పాహారం' పథకాన్ని ప్రారంభించాలని కొన్ని రోజుల కిందట నిర్ణయం తీసుకున్నారు. అయితే ఈ నెల 13 నుంచి దసరా సెలవులు ఉన్నందున ఈ పథకాన్ని ఈ నెల 6నే ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. తాండూరులో మంత్రి మహేందర్‌రెడ్డి ప్రారంభించనున్నారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ఒక్కో పాఠశాలను ఎంపిక చేసి శుక్రవారం ఎమ్మెల్యేలు ప్రారంభించనున్నారు. మన ఊరు-మన బడి కార్యక్రమం ద్వారా అభివృద్ధి చేసిన పాఠశాలల్లో దీనిని ప్రారంభించడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. తరువాత జిల్లాలోని అన్ని పాఠశాలల్లో అమలుచేయనున్నారు.

### మధ్యాహ్న భోజన ఏజెన్సీల ద్వారా అల్పాహారం

ప్రభుత్వం ప్రారంభించనున్న ముఖ్యమంత్రి అల్పాహారం పథకం ద్వారా జిల్లాలో 91,494 మంది విద్యార్థులకు ఉపయోగం కలుగనున్నది. జిల్లాలో 711 ప్రాథమిక పాఠశాలలు, 116 ప్రాథమికోన్నత పాఠశాలలు, 176 ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిలో 1 నుంచి 5వ తరగతి వరకు 47,459 మంది విద్యార్థులు ఉండగా, 6 నుంచి 10వ తరగతి వరకు 44,035 మంది విద్యార్థులు ఉన్నారు. అల్పాహారంలో అందించే మెనూ ఇంకా నిర్ణయం కాకపోయినా రవ్వ ఉప్మా, పొంగలి, కేసరి, కిచిడీ వంటి వాటిని అందించేందుకు విద్యాశాఖ పరిశీలిస్తున్నట్లు తెలిసింది. మిల్లెట్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్న వంట ఏజెన్సీల ద్వారానే దీనిని కూడా అమలు చేయనున్నారు. శుక్రవారం జిల్లాలోని తాండూరు నియోజకవర్గంలోని గౌతాపూర్‌లో, కొడంగల్ పట్టణంలోని ప్రాథమిక పాఠశాల, పరిగిలో మన్నెగూడ ప్రాథమిక పాఠశాల, వికారాబాద్ పట్టణంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అల్పాహారం పథకాన్ని ప్రారంభించనున్నారు.

### విద్యార్థులకు ప్రయోజనం

**- రేణుకాదేవి, డీఈవో**



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు అల్పాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇది విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది. చాలా విద్యార్థులు ఉదయం ఏమీ తినకుండా బడికి వస్తుంటారు. అలాంటివారికి సీఎం అల్పాహార పథకం మేలు కలిగిస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే మధ్యాహ్న భోజన పథకం, రాగి జావ అందజేస్తున్నాం. ప్రభుత్వ ఆదేశానుసారం శుక్రవారం జిల్లాలోని నాలుగు శాసనసభ నియోజకవర్గాల పరిధిలోని ఒక్కో పాఠశాలలో ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నాం.

# కల్వకుర్తి కాంగ్రెస్‌పై 'కసిరెడ్డి' పంజా

- నియోజకవర్గంలో నిట్టనిలువునా చీలిన పార్టీ శ్రేణులు
- ప్యారాచూట్ నేతకు టికెటిస్తే ఊరుకునేది లేదంటున్న సుంకిరెడ్డి వర్గం
- ఏడాది నుంచి పార్టీని కాపాడుకుంటూ వచ్చిందెవరని ప్రశ్న
- నాలుగు మండలాల్లో విస్తృతంగా సమావేశాల నిర్వహణ

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ)/ఆమనగల్లు : మహేశ్వరం.. మల్కాజిగిరి.. మెదక్.. తాజాగా కల్వకుర్తి! బీఆర్‌ఎస్ టికెట్ ఇవ్వని నేతలను మాత్రమే నమ్ముకొని మనుగడ సాధిస్తున్న కాంగ్రెస్ పార్టీకి షాకుల మీద షాకులు తగులుతున్నాయి. పార్టీని నమ్ముకున్నవారిని కాదని, రాత్రికి రాత్రి కండువా మార్చిన వారి చేతిలో టికెట్ పెట్టే దుర్నీతిని ఆ పార్టీ నేతలే ఎండగడుతున్నారు. ఇందులో భాగంగా కల్వకుర్తి నియోజకవర్గంలోనూ తాజాగా పార్టీ శ్రేణులు అధిష్టానానికి షాక్ ఇచ్చాయి. ప్యారాచూట్ నేతతో పని కానిద్దామనుకున్న అధిష్టానానికి పార్టీ శ్రేణులు అల్టిమేటం జారీ చేస్తున్నాయి. ఇంతకాలం పార్టీ కోసం కష్టపడినవారిని కాదని రాత్రికి రాత్రి కండువా మార్చిన వారికి ఇస్తే ఊరుకునేది లేదని హెచ్చరిస్తున్నాయి. ఈమేరకు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి వర్గం నేతలు, కార్యకర్తలు భారీ ఎత్తున సమావేశాలు నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా గురువారం ఆమనగల్లులో నిర్వహించిన సమావేశంలోనూ ఇదేరీతిన నేతలు అధిష్టానానికి సంకేతాలు పంపారు. సర్వే రిపోర్టుల ఆధారంగా టికెట్లు కేటాయించాలేగానీ.. రాత్రికి రాత్రి పార్టీ మారిన వారికి టికెట్లు ఇవ్వాలనుకోవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు.

**కాంగ్రెస్‌లో కుమ్ములాటలు**

సాధారణంగా ఒక రాజకీయ పార్టీ తమ పార్టీ నాయకుల్లో ఎవరు మెరుగో గుర్తించి.. వారికి పోటీ చేసే అవకాశం ఇస్తుంది. కానీ తాజా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తీరు విచిత్రంగా తయారైంది. సొంత పార్టీ నేతల్ని కాదని.. అధికార బీఆర్‌ఎస్ ఎవరికి టికెట్ ఇవ్వలేదో గుర్తించి, వారికి పార్టీ కండువా కప్పి టికెట్ ఇచ్చేందుకు నానా తంటాలు పడుతున్నది. ఇప్పటికే మహేశ్వరం నియోజకవర్గంలో కొంతకాలం కిందట పార్టీలోకి వచ్చిన నేతకు టికెట్ ఇస్తున్నారని, ఇందుకోసం ఐదెకరాల భూమి, రూ.10 కోట్లు చేతులు కూడా మారాయనే ఆరోపణలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. అదేవిధంగా మేడ్చల్ జిల్లాలోని మల్కాజిగిరి, అదే సమయంలో మెదక్ అసెంబ్లీ నియోజకవర్గంలోనూ రాత్రికి రాత్రి పార్టీ మారిన వారికి టికెట్ ఖరారైందంటూ చెబుతున్నారు. దీంతో అటు మేడ్చల్, ఇటు మెదక్ డీసీసీ అధ్యక్షులు సహా పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీ నేతలు రాజీనామాలు చేశారు. ఇప్పుడు కల్వకుర్తి నియోజకవర్గ వంతు వచ్చింది. ఇక్కడ కూడా బీఆర్‌ఎస్‌లో టికెట్ రాని నేతను పార్టీలో చేర్చుకొని



ఆమనగల్లులో జరిగిన సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు

టికెట్ చేతిలో పెట్టేందుకు రంగం సిద్ధమవుతుందనే సమాచారం కల్వకుర్తి కాంగ్రెస్ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. వాస్తవానికి ఎన్నారై సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి కల్వకుర్తి నియోజకవర్గంలో గత ఏడాది, ఏడాదిన్నరగా కాంగ్రెస్ పార్టీకి పెద్ద దిక్కుగా వ్యవహరిస్తున్నారని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఏఐసీసీ రాష్ట్ర కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి ఢిల్లీకే పరిమితం కావడంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూనే కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎలాగూ సుంకిరెడ్డికే ఈసారి టికెట్ ఖరారవుతుందనే ఆశతో పార్టీ శ్రేణులు ఉన్నాయి. కానీ రాత్రికి రాత్రి బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి కాంగ్రెస్‌లోకి రావడంతో ఇప్పుడు పరిస్థితి 'ముందొచ్చిన చెవుల కంటే.. వెనకొచ్చిన కొమ్ములు వాడి' అన్నట్లుగా తయారైంది. ముఖ్యంగా ఎన్నారై రాఘవేందర్‌రెడ్డి వెనుక టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రోద్బలం ఉండగా.. అందుకు వ్యతిరేకంగా వంశీచంద్‌రెడ్డి హుటాహుటిన కసిరెడ్డిని రంగంలోకి దింపారు. అంటే.. రేవంత్-వంశీ పోరు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీని నమ్మకొని పనిచేసినవారి మెడకు చుట్టుకుంది. ఇన్నాళ్లూ కష్టపడిన తమను కాదని కసిరెడ్డికి టికెట్ ఇస్తే ఊరుకునేది లేదంటూ నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు గళం విప్పాయి. సుంకిరెడ్డి వర్గం నేతలు భారీ ఎత్తున సమావేశాలు నిర్వహిస్తున్నారు. కల్వకుర్తి, వెల్దండ, ఆమనగల్లు, మాడ్గుల మండలాల్లో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమావేశాలు నిర్వహించుకొని, ప్యారాచూట్ నేతకు టికెట్ ఇస్తే తాము కార్యాచరణ ప్రకటిస్తామని అధిష్టానానికి హెచ్చరికలు జారీ చేస్తున్నారు. గురువారం ఆమనగల్లులో ఆమనగల్లు మండల కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులకు ఇన్నాళ్లు సుంకిరెడ్డి అండగా నిలిచారని, పార్టీ కోసం అహర్నిశలు పనిచేశారన్నారు. కానీ ఇప్పుడు ఆయన్ని కాదని పార్టీలోకి కొత్తగా వచ్చిన వారికి అధిష్టానం టికెట్ ఇస్తే ఊరుకునేదిలేదని పలువురు సీనియర్ నాయకులు హెచ్చరించారు.

### గడ్డమల్లాయగూడ, చౌదర్‌పల్లిలో కొలువుల పండుగ

యాచారం/ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 5 : మండలంలోని గడ్డమల్లాయగూడ, చౌదర్‌పల్లి గ్రామాల్లో కానిస్టేబుల్ ఉద్యోగాల పంట పండింది. బుధవారం విడుదలైన కానిస్టేబుల్ ఎంపిక జాబితాలో ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా రెండు గ్రామాల్లో 13 మంది చొప్పున యువకులు కానిస్టేబుల్ ఉద్యోగాలను సాధించారు. దీంతో మండలంలోనే అధికంగా కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన గ్రామాలుగా గడ్డమల్లాయగూడ, చౌదర్‌పల్లి గ్రామాలు సమవుజ్జీవులుగా నిలిచాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగాలు సాధించిన యువకుల తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు సంతోషంలో మునిగితేలారు. ఇప్పటికే రెండు గ్రామాల్లో 30-40 శాతం మంది ఉద్యోగస్తులుగా ఉండటంతో గ్రామాలను కొలువుల కల్పవల్లిగా పిలుస్తారు. గడ్డమల్లాయగూడ గ్రామంలో కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన 13 మందిలో ఒకరు సివిల్, 8 ఏఆర్, 4 టీఎస్‌ఎస్‌పీ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక గ్రామంలో వివిధ శాఖల్లో సుమారు 100 ఉద్యోగాలు సాధించడం గమనార్హం.

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సహకారంతో ఎంకేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందినవారు అధికంగా ఉద్యోగాలను సాధించారు. గ్రామంలో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించినవారిలో దండు శేఖర్, చీర జయశ్రీ, గండికోట రవికుమార్, ఆవ భాస్కర్, ఆర్ల రవి, అచ్చన గణేశ్, అచ్చన మమత, అచ్చన మహేశ్, అచ్చన దినేశ్, బొడ్డు మహేశ్, గౌర సాయికుమార్, గౌర శశికుమార్, కొనల సంధ్య ఉన్నారు. ఇప్పటికే గ్రామంలో ఇద్దరు ఎస్‌ఐలుగా ఎంపికైన విషయం విదితమే. ఉద్యోగ సాధనలో గడ్డమల్లాయగూడ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పలువురు అంటున్నారు. చౌదర్‌పల్లి గ్రామంలోనూ 13 మంది యువకులు కానిస్టేబుల్ ఉద్యోగం సాధించారు. ఇందులో 4 టీఎస్‌ఎస్‌పీ, 2 ఎక్సైజ్, ఒకరు సివిల్, 6 ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఉద్యోగం సాధించినవారిలో గొరిగె మహేశ్, గౌర నరేశ్, అమీర్‌పేట శశిప్రీత్, అమీర్‌పేట లక్ష్మణ్, బుడిగల మహేశ్, జుట్టు నాగరాజు, అమీర్‌పేట పూజ, గదారి శ్రీను, మారమోని శ్రీను, కొమ్ము హరీశ్, పోదేటి ప్రదీప్ చంద్ర, గొరిగె శివకుమార్ ఉన్నారు. ఆదర్శ పాఠశాలలో చదువుకున్నవారిలో కోరెంక మహాలక్ష్మి, రమావత్ స్రవంతి, రాత్లావత్ సరిత, కడారి అనిత, ఉదయ్ కిరణ్, దినేశ్‌కుమార్, దోస మధూకర్, గౌర సాయికుమార్, గాదరి ధరిణి, వస్పరి శివ ఉన్నారు. ఇందులో ఎంతో మంది నిరుపేద కుటుంబాలకు చెందినవారు కావడంతో వీరిని మండల ప్రజాప్రతినిధులు అభినందించారు.